





కాంతులీనుతున్న విద్యుత్ ప్రభ (ఫైల్)

నేత్ర పర్వం ప్రభల సంబరం

- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులు
- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ప్రభల పండుగగా కోటయ్య తిరునాళ్ల ప్రసిద్ధి

(కోటప్పకొండ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతున్న కోటప్పకొండ తిరునాళ్లలో కొలువు తీరే ప్రభలు నేత్ర పర్వంగా దర్శనమివ్వనున్నాయి. మహా శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న బుధవారం జరిగే తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన కోటయ్య తిరునాళ్లకు ప్రభల పండుగగా ప్రసిద్ధి చెందింది. కొండకు తరలివచ్చే భారీ విద్యుత్ ప్రభలను తిలకించేందుకు ప్రత్యేకంగా భక్తులు తరలివచ్చి సంబరపడతారంటే ఆశ్చర్యం కాదు. కొండపై కొలువైన కోటయ్యస్వామి కిందకు దిగి రావాలంటే కోటిన్నొక్క ప్రభ నిర్మించాలని స్థల పురాణం చెపుతున్నది. అందుకే తిరునాళ్లకు అధిక సంఖ్యలో ప్రభలను భక్తులు నిర్మించి తీసుకొస్తారు. మహాశివరాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తెల్లవార్లు ప్రభల వెలుగులు ఒకవైపు, మరోవైపు ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు జాగరణ పూర్తి చేస్తారు. ఒక్కో ప్రభ 90 అడుగులకుపైగా ఎత్తులో రూపుదిద్దుకుంటుంది. ప్రభల వ్యయం రూ.కోట్లల్లో ఉంటుంది. ప్రభలపై రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. భారీ విద్యుత్ ప్రభలతో పాటు సాధారణ ప్రభలను పెద్ద సంఖ్యలో భక్తులు కోటయ్యస్వామి సన్నిధికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ ప్రభల వెలుగులు కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి. చిన్నారులు ప్రభలు కట్టుకుని చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాల నుంచి కాలి నడకన ఉత్సాహంగా కొండకు తరలివస్తారు. మొక్కుబడి ప్రభలతో నడిచి రాలేని వారు వాహనాలపై వీటిని అమర్చుకుని కొండకు తరలివస్తారు. ప్రభలపై సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. గతంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించే వారు. పోలీసు శాఖ వీటిని నిషేధించింది.

గ్రామాల్లో పోటాపోటీ..

ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. గ్రామ గౌరవ ప్రతిష్ఠ కోసం అందంగా ప్రభలను నిర్మించడంలో పోటీ ఉంటుంది. ఈ ప్రభలలో పోసకూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు తదితరాలు ఉంటాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ఇవి అద్దం పడతాయి. చిలకలూరిపేట మండలంలోని కావూరు, మద్దిరాల, యడవల్లి, కమ్మవారి పాలెం, పురుషోత్తపట్నం, నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం, నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం గ్రామాల నుంచి భారీగా విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి. గతంలో ఎడ్లతో ప్రభలను తరలించే వారు. నేడు ట్రాక్టర్ల ద్వారా ప్రభలను తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. 90 అడుగుల ఎత్తులో నిర్మించే ప్రభలను ప్రత్యేకంగా తయారు చేసిన రథాలపై అమరుస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పని వారు వెంట నడుస్తారు.

పెండ్లి కుమారుడిగా అమరేశ్వరుడు

- అమరావతిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమ య్యాయి. ఆలయ వంశపా రంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ తరఫున స్వామివార్లకు పీసపాటి అమరేశ్వర శర్మ పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. అర్చకులు, వేదపండితులు మంగళవా యిద్యాలు, వేదమంత్రోశ్చరణల మధ్య అమరేశ్వరుడ్ని పెండ్లి కుమారుడిగా చేశారు. కార్యక్రమంలో ఈవో సునీల్‌కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల కాంతిలో ప్రధాన రాజగోపురం

పెళ్లికుమార్తెగా కాకాని భ్రమరాంబ

పెదకాకాని, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మాఘ ఆదివారం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి నివేదన చేశారు. మేళ తాళాల నడుమ ప్రభలతో ఆలయానికి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలిరోజు భ్రమరాంబ అమ్మవారు పెండ్లికుమార్తె అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, పంచహారతులు రుద్రాభిషేకం, విఘ్నేశ్వర పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం అమ్మవారు శ్రీవనదుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తారని ఈవో తెలిపారు.



పెళ్లి కుమార్తెగా భమరాంబ అమ్మవారు

అమరావతి టవర్లు డయాగ్రిడ్ డిజైన్‌తో..

- నూతన సాంకేతికతతో భవనాల నిర్మాణం
- కరకట్టకు రెండు వైపులా రక్షణ గోడ
- నాలుగు లేన్ల రహదారికి తగ్గనున్న వ్యయం
- నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ
- అమరావతి నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా అత్యాధునికమైన 'డయాగ్రిడ్' డిజైన్‌లో రాజధాని టవర్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ మంత్రి నారాయణ అధ్యక్షతన తాజాగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రాజధాని నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కరకట్ట మీదగా రాజధాని నగరానికి నిర్మించే నాలుగు లేన్ల రహదారికి అయ్యే ఖర్చును అంచనా వేశారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, రాజధాని నగరానికి తాగునీరు, మురుగునీరు యాజమాన్య నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని తీర్మానించారు. రాజధాని పనులన్నీ సమగ్రంగా, సమాంతరంగా జరగడానికి అన్ని శాఖలు ఒక టీంలా పనిచేయాలని నిర్ణయించారు.

ముఖ్యమైన నిర్ణయాలు ఇవీ..

రాజధాని అమరావతికి ప్రస్తుతం ఇరుకుగా ఉన్న కృష్ణానది కరకట్ట మీదగా వెళ్లాలి. ఈ రోడ్డుపై ఎదురెదురుగా రెండు వరుసల్లో భారీ వాహనాలు వెళ్లే వీలు లేదు. అందువల్ల కరకట్ట మీదగా రాజధానికి విశాలమైన నాలుగు వరుసల రహదారి నిర్మాణం అత్యవసరంగా చేపట్టాలని, దీనికోసం కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలని నిర్ణయించారు. రిటైనింగ్ వాల్‌ను నిర్మించకుండా బంకమట్టి వేసి దానిపై రహదారి నిర్మాణం చేపడితే.. రక్షణ లేకపోవడమే కాకుండా నిర్మాణ వ్యయం రూ.2,600 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్ నిర్మించి రహదారి వేస్తే రూ.1,800 కోట్లు అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు లెక్కలుగట్టారు. రక్షణ గోడలతో రహదారికి భద్రత ఉండటమే కాకుండా.. నిర్మాణ వ్యయమూ తగ్గుతుండటంతో ఈ విధానంలోనే రోడ్డు నిర్మించాలని తీర్మానించారు.


☛ రాజధాని నగరంలోని నిర్మాణాలను మున్సిపల్, ఇరిగేషన్, ఇంధన తదితర శాఖల సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించారు.

☛ సంక్లిష్టమైన సాంకేతిక విధానాలతో కూడుకున్న భవన నిర్మాణాలకి స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్(ఎస్ఎస్ఆర్) ఖరారు చేయడానికి సిఫార్సు చేయాలని తీర్మానించారు. డయాగ్రిడ్ డిజైన్‌లో నిర్మాణంలో వాడే స్టీల్ అత్యంత ఖరీదుతో కూడు కున్నది. ఫ్యాబ్రికేషన్, వెల్డింగ్‌ను కూడా అత్యాధునిక సాంకేతిక విధానంలో చేపట్టాల్సి ఉంటుంది. దీనికి నిపుణులైన పనివారు అవసరమవుతారు. వీరికి సాధారణ కూలీ లకంటే రెట్టింపు చెల్లించాలి. ఎస్ఎస్ ఆర్‌లో లేని దీనిని ఎస్ఎస్ఆర్‌లో చేర్చాల్సి ఉందని నిర్ణయించారు. భారీ నిర్మాణాల్లో అగ్ని నిరోధక విధానాలను అవలంబించాల్సి ఉంటుంది. అగ్ని నిరోధక విధానాలకు అత్యంత ప్రాధా న్యం ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

☛ రాజధాని మౌలిక వసతుల్లో అత్యంత ప్రధానమైనది తాగు, మురుగునీటి యాజమాన్య నిర్వహణ వ్యవస్థలు. వందేళ్లకు సరిపడా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని నిర్ణయించారు.

డయాగ్రిడ్ విధానం అంటే..

రాజధాని నగర నిర్మాణాలను సరికొత్తగా డయాగ్రిడ్ డిజైన్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దీనిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సాధారణంగా భవన నిర్మాణాల కోసం ముందుగా పునాదులు తవ్వి పిల్లర్లను వేసి శ్లాబ్ వేస్తారు. ఇలా అం తస్తుల మీద అంతస్తులు నిర్మిస్తారు. డయా గ్రిడ్.. అంటే డయాగ్నల్‌గా గ్రిడ్ రూపంలో ఉండే భవంతి డిజైన్‌లో ముందుగా మధ్యలో ఒకపెద్ద దిమ్మ తరహాలో నిటారుగా పిల్లర్‌ను పైకి లేపుతారు. పిల్లర్ చివరిలో శ్లాబులను వేసేందుకు అనువుగా కాంక్రీట్‌తో కూడిన సపోర్టును ఇస్తారు. వాటిని ఆధారంగా చేసుకుని శ్లాబులు వేస్తారు. అంటే.. సైకిల్ లేదా మో టారు సైకిల్ చక్రాన్ని పడుకోబెడితే.. మధ్య లోని హబ్ బేస్‌గా రిమ్‌కు ఊచలు కలిపి ఉండే తరహాలో డయాగ్రిడ్ డిజైన్ కూడా ఉంటుంది. ఐమూలగా అతికించిన ఐరన్, కలప లేదా కాంక్రీట్ బీమ్‌లతో ఒక్కో ఫ్లోర్ ను తీర్చిదిద్దుతారు. చుట్టు అద్దాలు అతికించి బిల్డింగ్‌ను నిర్మిస్తారు. సంప్రదాయ విధానం లో వాడే ఇనుము కన్నా డయాగ్రిడ్ విధా నంలో ఇనుమును తక్కువగా వినియోగిస్తారు.



నిర్లక్ష్యం.. ప్రాణాలు పణం



- రోడ్లపైకి భారీగా ఆటోలు, బైక్‌లు
- నిబంధనలు పట్టించుకోని వాహనదారులు
- పరిమితికి మించి ప్రయాణికులు.. ఓవర్ స్పీడ్
- ప్రమాదం జరిగినప్పుడే పోలీసు, రవాణాశాఖ హడావిడి
- మొక్కుబడిగా చేస్తున్న రహదారి భద్రత మాసోత్సవాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓవర్‌లోడు.. ఓవర్ స్పీడు.. ఇదీ జిల్లాలో ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు. ఇరుకు రోడ్లపైన, రద్దీగా ఉండే రహదారుల్లోనూ ఆటోలు, బైక్‌ల విన్యాసాలతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కళ్లెదుట నిండు ప్రాణాలు బలవుతున్నా.. వాహన చోదకులు నిర్లక్ష్యం వీడటంలేదు. మితిమీరిన వేగంతో వాహనాల్ని నడుపుతూ తమతో పాటు ఎదుటి వారి ప్రాణాలను కూడా తీస్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడం, ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించకపోవడంతో ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య అధికంగా ఉంటున్నది. అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం తాగి వాహనాన్ని నడపడం, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్.. ఇలా కారణం ఏదైనా నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతుండగా వీటిలో అధికశాతం ద్విచక్రవాహనాల తర్వాత ఆటోలే ఉంటున్నాయి. నిత్యం ఏదో ఒక మూల ప్రమాదాల రూపంలో మృత్యుఘంటి కలు మోగుతూనే ఉన్నాయి. రోడ్డు ప్రమా దాలను నివారించడంలో పోలీసు శాఖ నిర్లక్ష్యంతోడు రవాణాశాఖ వైఫల్యం కొట్టొచ్చి నట్లు కనిపిస్తోంది. వాహన చోదకులకు కల్పించే అవగాహన కార్యక్రమాలు మొక్కుబడి తంతుగా మారుతున్నాయనేందుకు తరచూ జరుగుతున్న ప్రమాదాలే నిదర్శనం. ఏటికేడు ఆటోల సంఖ్య పెరిగిపోతున్నది. వాటిని నడిపే వాళ్ల డ్రైవింగ్‌పై కనీస అవగాహన లేకపోవడంతో పాటు నిద్ర, మద్యం మత్తు దారుణాలకు కారణమవుతోంది. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ఈ క్రమంలో జాతీయ రహదారిపై పాటించాల్సిన నిబంధనలకు యథేచ్ఛగా పాతరేస్తున్నా పట్టించుకునే వారు లేరు. పరిమితికి మించి ప్రయాణికులకు ఆటోలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు పేరిట అధికారుల హడావిడే తప్ప వాటి వల్ల ఒనగూరుతున్న ప్రయోజనం గుండుసున్నా. గత నెల 16 నుంచి ఈనెల 15 వరకు 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. రవాణా, ఆర్టీసీ, పోలీసు, తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. అయితే ప్రారంభం రోజు మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా అవగాహన, ప్రమాదాల నియంత్రణపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.



ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు

తనిఖీలు ముమ్మరం చేస్తాం

వరుస రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరం. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించినా పట్టించుకోవడం లేదు. హెల్మెట్ ధరించాలని స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తునే ఉన్నాం. కానీ ద్విచక్రవాహనదారుల్లో మార్పులేదు. ఇకపై తనిఖీలు నిరంతరం చేసి కేసులతో పాటు, భారీ జరిమానాలు విధిస్తాం. బ్లాక్‌స్పాట్ల వద్ద సైన్‌బోర్డులను ఏర్పాటు చేస్తాం. ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు హైవేపైకి వస్తే చర్యలు తీసుకుంటాం.

- సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు

బ్లాక్‌స్పాట్ల గుర్తింపుతో సరి..

తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి బోర్డుల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్వీస్ రోడ్డులో నుంచి హైవేపైకి వచ్చే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్‌లను గుర్తిం చే విషయంలో నిర్లక్ష్యం, ప్రమాదం జరిగినప్పుడు హడావిడి తప్ప మూలాల్లోకి వెళ్లే ప్రయత్నమే చేయడం లేదు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడంలో పోలీసు, రవాణాశాఖల వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. జరి మానాల కోసమే డ్రంకెన్ డ్రైవ్ అన్న అభిప్రాయం వాహన చోదకుల్లో స్థిరపడింది.

15 మంది సిబ్బందికి మెమోలు

- ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు

6

మోసాలకు అడ్డుకట్ట!

- మిర్చియార్డులో ఇంటిగ్రేటెడ్ కాటాల ఏర్పాటు
- మార్కెటింగ్ శాఖకు సీఎం ఆదేశం
- కొద్ది రోజుల్లో ప్రొక్యూర్‌మెంట్ చేయనున్న అధికారులు

6

ప్రశాంతంగా గ్రూపు-2 మెయిన్ పరీక్షలు

- పేపర్-1 పరీక్షకు 85.45 శాతం మంది హాజరు
- పేపర్-2కి 85.37 శాతం మంది
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన జేసీ భార్గవ తేజ



8

గుంటూరు ఏసీ కళాశాలలో రూం నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


పసుపు పంటను పరిశీలిస్తున్న అమెరికాకు చెందిన కీత్ అగోడా

గుంటూరు సిటీ, కొల్లిపర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన సుప్రసిద్ధ ఫ్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా, వ్యవసాయ రంగంలో పేరొందిన ప్రముఖ యూరోపియన్ వ్యాపారవేత్త, ప్రధాన పంపిణీదారు ప్యాట్రిక్ స్ట్రూబీ ఆదివారం గుంటూరు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ నిర్వహించింది. తొలుత గుంటూరులోని జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేనేజర్ కె.రాజకుమారి పలు విషయాలను విదేశీ ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా స్థాయిలో సిబ్బంది నిర్మాణం, ప్రకృతి వ్యవసాయ 9 సార్వత్రిక సూత్రాలను ఆమె విదేశీ ప్రతినిధులకు వివరించారు. అనంతరం కొల్లిపర మండలం దావులూరిపాలెం గ్రామంలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన గుళికెల తయారీ విధానాలను ప్రత్యక్షంగా చూశారు. గ్రామానికి చెందిన వసంత కుమారి వ్యవసాయ క్షేత్రంలో ఏ-గ్రేడ్ అరటి తోటలను, ఎనీ టైం మనీ మోడల్‌ల ను సందర్శించారు. వివిధ పద్ధతుల్లో సాగుచేసే అరటి తోటలను పరిశీలించారు. విత్తన దశ నుంచి పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించే రైతు కన్నయ్య, సి.రామారావు వ్యవసాయ క్షేత్రాలతోపాటు రసాయన వ్యవసాయం చేసే టి.బాబు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రసాయన వ్యవసాయంతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయంలో మట్టి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ మట్టి నిర్మాణం ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అదనపు డైరెక్టర్ డాక్టర్ సీబీ హరినాథ్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయాధికారులు శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు మూడు పతకాలు



సీనియర్స్ విభాగంలో బరువును ఎత్తుతున్న చంద్రిక

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చందిన బొల్లినేని చంద్రిక సత్తా చాటింది. 84 కిలోలు పైబడిన విభాగంలో అద్భుతంగా రాణించి మూడు పతకాలను సాధించిందని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. స్క్వాట్‌లో బంగారు పతకం, డెడ్‌లిఫ్ట్‌లో కాంస్య పతకంతోపాటు ఓవరాల్‌గా కాంస్య పతకం సాధించినట్టు చెప్పారు. పతకాలు సాధించిన చంద్రిక, ఆమె కోచ్ నరేంద్రరాజులను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు మద్ది ప్రభాకర్‌రావు, జిల్లా వైస్ చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలంలో ఆదివారం జరిగింది. చిలకలూరిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలంవారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోటార్ బైక్‌పై సమీపంలోని రాజాపేటలో జరుగుతున్న ప్రార్థనా కూటములకు హాజరయ్యేందుకు బయలుదేరారు. దారి మధ్యలో ఒక లారీని దాటి ముందుకు వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చిన బైకుకు వీరి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాలవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్లమూడి విజయ్ (13) అనే బాలుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు పోలీసులు అప్పగించారు. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మోసాలకు అడ్డుకట్ట!

- మిర్చియార్డులో ఇంటిగ్రేటెడ్ కాటాల ఏర్పాటు
- మార్కెటింగ్ శాఖకు సీఎం ఆదేశం
- కొద్ది రోజుల్లో ప్రొక్యూర్‌మెంట్ చేయనున్న అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కాటాలలో జరుగుతోన్న మోసాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సమీకృత కాటాలను అమర్చాలని సీఎం చంద్రబాబు నాయుడు మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కాటాల వలన తూకం వేసిన వెంటనే మిర్చి తీసుకొచ్చిన రైతు, అమ్మిపెట్టిన కమీషన్ వ్యాపారి, కొనుగోలు చేసిన ఎగుమతిదారుడికి ఏకకాలంలో ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం చేరుతుంది. అలానే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కూడా ఆ వివరాలు చేరతాయి. దాంతో కాటాలలో పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. వీటిని సమకూర్చుకోవడం కొంచెం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అయినప్పటికీ రైతుల ప్రయోజనం దృష్ట్యా ఏర్పాటు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రైతు నష్ట పోవాల్సి వస్తుంది..

రైతులు గుంటూరు మిర్చియార్డుకు మిరప కాయలను అమ్ముకోవడానికి తీసుకొచ్చే ముందు మిర్చి కళ్లాలు, వేబ్రిడ్జీల వద్ద తూకం వేయిస్తున్నారు. అయితే యార్డులో సరుకు దిగుమతి జరిగి, కొనుగోళ్లు పూర్తి అయ్యాక వేసే కాటాలో తరుగు ఉంటుంది. దీనివలన రైతు నష్టపోవాల్సి వస్తుంది. ఇందుకు కారణం మిర్చి టిక్కీలను తెరిచి కొంతమంది మిరపకాయలను తస్కరిస్తున్నారు. అలానే హమాలీలు మచ్చుకాయలు తీస్తున్నారు. కొందరైతే మచ్చుకాయల పేరుతో కేజీలకు కేజీలు తీసుకొంటున్నారు. ఇవన్ని యార్డు నుంచి బయటకు తరలించి సొమ్ము చేసుకొంటూ రైతుకు నష్టం వాటిల్లేలా చేస్తున్నారు. కాటాలలో మోసాలు జరుగుతున్నాయని రైతులు గత కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

కమీషన్ దుకాణాల్లోనే..

మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జిగా డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉన్న సమయంలో వైఫై సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటాలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. అయితే వాటిని కొన్ని నెలలు మాత్రమే వినియోగించి రిపేర్లు వచ్చాయని మూలన పడేశారు. దాంతో మార్కెట్ కమిటీ నష్టపోయింది. ఈ కారణం వలన తిరిగి కమీషన్ దుకాణాలలో ఏర్పాటు చేసిన కాటాలనే వినియోగిస్తున్నారు. మార్కెట్ కమిటీ నియమించిన వేమెన్‌లు ప్రతి షాపు వద్దకు వెళ్లి కాటాలను నిశితంగా పరిశీలించి గేట్‌పాసు మంజూరు చేయాల్సి ఉండగా యార్డులో అలా జరగడం లేదు. వ్యాపారస్తుల గుమాస్తాలు వేమెన్‌ల అసోసియేషన్ల వద్దకు వెళ్లి కాటాలు వేశామని చెప్పి గేట్‌పాసులు తీసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో సమీకృత కాటాల వలన ఇలాంటి అసంబద్ధమైన విధానాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు. మార్కెటింగ్ శాఖ నుంచి ఆదేశాలు రాగానే ఇంటిగ్రేటెడ్ కాటాలను కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థికే మద్దతు

- ఏపీటీఎఫ్ నాయకుల ప్రకటన
- నైతిక బలాన్ని ఇచ్చింది: ఆలపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్ ప్రకటించారు. జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు కూటమి మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఇక్కడ ఆలపాటికే ఏపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఏపీటీఎఫ్ శ్రేణులు రాబోయే మూడు రోజులు వ్యూహాత్మకంగా పనిచేసి ఏపీటీఎఫ్ మద్దతు ఇచ్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీతో గెలిచేటట్లు పనిచేయాలని కోరారు. గత పాలనలో ఉపాధ్యాయులు ఆత్మగౌరవం కోసం పోరాటం చేశామని, ఉపాధ్యాయ, ఉద్యోగులను కనీసం ఓటర్లుగా పాలకులు చూడలేదన్నారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అయినా ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగింది..

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం గత 78 ఏళ్ల నుంచి విద్యారంగ ప్రగతికి, ఉపాధ్యాయ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందనీ, అలాంటి ఉద్యమ సంస్థ కూటమి అభ్యర్థినైన తనకు మద్దతు ఇవ్వడం నైతిక బలాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం వలన ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. గతంలో చంద్రబాబు 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చి జీతాలు పెంచారన్నారు. ఇప్పుడు కూడా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎలా మేలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా శాఖల ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాలీద్, వి.వి.రవికుమార్, పి. డి. సోషలిజం, గుంటూరు జిల్లా కమిటీ నాయకులు పి.నాగశివన్నారాయణ, పార్వతి, సత్యనారాయణ మూర్తి, లక్ష్మీనారాయణ, జనార్దన్, రమేష్, శంకర్, ఎన్ఆర్ఐ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారత్నం, హనుమంతరావు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులకు జేబీఏసీ మద్దతు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులకు జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ మోసిగంటి జోసెఫ్ ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. టీడీపీ కూటమితోనే క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందన్నారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాల పని తీరును గమనిస్తే విషయం స్పష్టం అవుతుందన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లను గెలిపించాలని జోసెఫ్ మోసిగంటి క్రైస్తవ సమాజానికి విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా గ్రూపు-2 మెయిన్ పరీక్షలు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

- పేపర్-1 పరీక్షకు 85.45 శాతం మంది హాజరు
- పేపర్-2కి 85.37 శాతం మంది

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 11 పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం అభ్యర్థులు పేపర్-1, 2 పరీక్షలను రాశారు. ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీసు జరగలేదని ఏపీపీఎస్సీ, రెవెన్యూ అధికారులు తెలిపారు. ఉదయం పరీక్షకు గ్రేస్ పీరియడ్ కలుపుకొని 9.45 గంటల వరకు అభ్యర్థులను లోనికి అనుమతించారు. ఒరిజినల్ ఐడీ, హాల్ టిక్కెట్ ఉన్న అభ్యర్థులనే పోలీసులు తనిఖీ చేసి పంపించారు. ఏపీపీఎస్సీ విజ్ఞప్తి మేరకు పరీక్ష కేంద్రాలు ఉన్న మార్గాల్లోకి ఏపీఎస్ఆర్టీసీ, సిటీ బస్సులను నడిపారు. మొత్తం 9,277 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఉదయం జరిగిన పేపర్-1కు 7,927 మంది వచ్చారు. 1350 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. దీంతో ఉదయం పరీక్షకు హాజరు శాతం 85.45గా నమోదైంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన పేపర్-2 పరీక్షకు 7,920 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో హాజరు శాతం 85.37గా నమోదైంది. పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ ఏపీపీఎస్సీ అధికారులతో కలిసి సందర్శించారు. తాగునీరు, వైద్య సదుపాయాలను పరీక్షా కేంద్రాల వద్ద పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.

1.40 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 1.40 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామనీ, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ఆయా జిల్లాల్లో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓటు తనకు వేయాలని ఆయన పట్టభద్రులను అభ్యర్థించారు. ఆదివారం గుంటూరులోని యూటీఎఫ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం తప్పా ఆచరణలో అమలు కావడం లేదనీ, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారో స్పష్టంగా చెప్పడం లేదన్నారు. పెన్షనర్లుకు ఫిట్‌మెంట్ ప్రకటించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయా సమస్యలు మండలిలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు రాజ్యాంగ విలువలకు కట్టుబడి 18 ఏళ్లుగా నీతి నిజాయితీతో పనిచేస్తున్నారని అన్నారు. వినతి పత్రాలు ఇచ్చే సమయంలో తన వద్ద ఉన్న పేపర్లు కింద పడిపోయాయనీ, వాటిని తీసుకునే ప్రయత్నంలో తాను కిందకు వంగాననీ, దీనిని సామాజిక మాధ్యమాల్లో కాళ్లకు మొక్కుతున్నట్లు అసత్య ప్రచారం చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు, కె.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలిసి పని చేయండి


వైవీని కలిసిన బొల్లా వ్యతిరేక వర్గం

- బొల్లా వ్యతిరేక వర్గానికి వైవీ సూచన

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీలోని బొల్లా వ్యతిరేక వర్గానికి చెందిన నాయకులు మూకుమ్మడిగా తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని వైవీ సుబ్బారెడ్డి నివాస గృహంలో వైవీని కలిశారు. బొల్లాతో కలిసి పని చేసేది లేదనీ, చుండూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పని చేయడానికి మేమంతా సిద్ధమైనట్లు వైవీకి తేల్చి చెప్పారు. సొంతగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని పార్టీ కోసం పనిచేస్తామని, ఈ విషయాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లి వినుకొండ సమన్వయకర్తను మార్చాలని వైవీ వద్ద ప్రతిపాదించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంత సులువుగా తీసుకునే నిర్ణయం కాదనీ, జగన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపినట్లు సమాచారం. ప్రత్యేకంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని, దీనికి పార్టీ అనుమతి ఇప్పించాలని కోరడంతో వినుకొండలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినప్పటికీ అందరూ కలిసి పనిచేయాలని వైవీ సూచించినట్లు అసమ్మతి నేతలు తెలిపారు. శావల్యాపురం వైసీపీ సీనియర్ నాయకులు చుండూరి వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోనుగుంట్ల వెంకటహనుమయ్య, శాకమూరి బుచ్చయ్య, నక్కా నాగిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు, నరాలశెట్టి శ్రీను, బాబు, పీకేరావు, వెంకటేశ్వరరెడ్డి, స్వెనోమ్‌తో పాటు సుమారు వందమంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అవినీతి రహిత సేవలందించండి

- రిజిస్ట్రేషన్ శాఖకు త్వరలో నూతన భవనం
- మంత్రి అనగాని సత్యప్రసాద్


మంత్రి సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అసోసియేషన్ నాయకులు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు అవినీతి రహిత సేవలందించాలని రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ సబ్ రిజిస్ట్రార్ల అసోసియేషన్, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ ఉద్యోగుల సంఘం సంయుక్త సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనగాని తొలుత డైరీ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలతో మమేకమై మంచి సేవలు అందించి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని కోరారు. ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసే విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ల శాఖకు వీలైనంత త్వరగా నూతన భవనాలు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని, ఆ పోస్టులను సచివాలయ సిబ్బంది చేత భర్తీ చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు రద్దు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసినందుకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉద్యోగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ జి.శ్రీనివాస్, డీఆర్‌లు, సబ్ రిజిస్ట్రార్‌లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సాగరమాత పతాకావిష్కరణ


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి భాగ్యయ్య

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్ సాగరమాత ఆలయంలో ఆదివారం గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య చేతుల మీదుగా సాగరమాత పతాకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో నవదిన జపములు, దివ్య బలిపూజలను నిర్వహించారు. ఆలయం చుట్టూ తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి భాగ్యయ్య మాట్లాడుతూ మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు సాగరమాత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 26 నుంచి మార్చి 6వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 5:30 గంటల నుంచి నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సాగరమాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, ఫాదర్ అన్నెం జోసఫ్‌తంబి, ఆలయ పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఆలేటి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

15 మంది సిబ్బందికి మెమోలు

- ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు
- సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ


గురుకుల పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న పద్మజ

రేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 15 మంది సిబ్బందికి మెమోలు జారీ చేశామనీ, ప్రిన్సిపాల్ గిరిజా కుమారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. వంట గదులు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ గిరిజాకుమారి, ఉపాధ్యాయినుల మధ్య తరచూ విభేదాలు వస్తున్నాయనీ, వీటిని పరిష్కరించుకోవాలని ఆదేశించినా పట్టించుకోవడంలేదన్నారు. స్వయాన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దగ్గర ఉండి మరుగుదొడ్లు శుభ్రం చేయించే పరిస్థితి ఉందంటే వీరి పనితీరు ఎలా ఉందో అర్థమౌతుందన్నారు. లక్షల జీతాలు తీసుకుంటున్నారే తప్పా బాధ్యతగా విధులు నిర్వహించటంలేదని అన్నారు. వీరి కారణంగా విద్యార్థులు బలైపోతున్నారన్నారు. ఆహార విషయంలో కూడా నాణ్యత పాటించటంలో విఫలం చెందారన్నారు. వీటన్నింటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. మెమోలపై వివరణ ఇచ్చిన అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


బాబూరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లి వల వేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి వలలో చిక్కుకొని మత్స్యకారుడు చిప్పల బాబూరావు(39)మృతి చెందాడు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం సముద్రంలో శనివారం భార్య,భర్తలైన బాబూరావు, రాఘవమ్మ చేపల వేటకు వెళ్లారు. వల విసురుతుండగా సముద్రంలో జారిపడి వలలో చిక్కుకొని మృతి చెందాడని ప్రత్యక్ష సాక్షి, భార్య రాఘవమ్మ తెలిపింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అడవులదీవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నిజాంపట్నం ఇన్‌చార్జ్ ఎస్ఐ తిరుపతిరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భార్య రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 533.40 అడుగులు ఉంది. ఇది 174.86 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8986 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,333 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, చంద్రమౌళీనగర్ ఒకటో లైను ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు గుంటూరు టౌన్-2 డిప్యూటీ ఈఈ గురవయ్య తెలిపారు.

ఖురాన్ ప్రేమతత్వాన్ని చిన్నారులకు నేర్పించండి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే పిల్లలకు ఆధ్యాత్మిక అంశా లతోపాటు ఖురాన్ చెప్పిన దయ, కరుణ, ప్రేమతత్వాన్ని నేర్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరులోని అంజుమన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ విశిష్టత గురించి విద్యా ర్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే విధానాలు, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ అంశాలపై విద్యార్థులు అవ గాహన పెంచుకోవాలని సూచించారు. ఖురాన్ బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ దయ, కరుణ, ప్రేమతత్వం కలిగి ఉండాలని చెప్పారు. పవిత్ర ఖురాన్ బోధనల్లో దానధర్మాలు, ఐక్యత వంటి గొప్ప లక్షణాలను ఆచరించాలని అన్నారు. ఓర్పు, స్వీయ నియంత్రణ ఆధ్యా త్మిక అంశాల ద్వారా నేర్చుకోవాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షలు పాల్గొన్న విద్యార్థులను ఎమ్మెల్యే నసీర్ అభినందించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు జీవితాన్ని అంకితమిచ్చిన సంత్ గాడ్గే బాబా

-పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ గాడ్గే బాబా అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా గుంటూరు సాయిబాబారోడ్డులో నిర్వహించిన



గాడ్గే బాబా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన జీవిత చరిత్రను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ అంటరాని తనం నిర్మూలనకు, మూఢనమ్మకాల నుంచి విముక్తి కోసం పోరాడిన యోధుడు గాడ్గే బాబా అని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, వడ్ల మూడి వెంకటేశ్వరరావు, రాచకొండ నాగేశ్వరావు, గుర్రపుశాల రామకృష్ణ, నరసింహారావు, లక్ష్మయ్య, వేంపాటి విజయలక్ష్మి, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే బాబా జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్ గాడ్గే బాబా జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి నేటి తరానికి తెలియజే యాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాస రావు కోరారు. ఏపీ రజక జన సేవాసంఘం ఆధ్వర్యంలో కాకుమానువారితోటలోనున్న యానాది స్కూల్ ఆవరణలో బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగసముద్రం పరమేశ్వరరావు, తాడికొండ నరసింహారావు, డెన్నిస్ రాయ్, ఈమని ఉమామహేశ్వరరావు, వట్టికూటి సాంబ య్య, మానేపల్లి దుర్గారావు, రాచకొండ లక్ష్మయ్య, కొండలరావు, సురేష్, నాగరాజు, గణేష్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సినీ నటి అనసూయకు ఘన సన్మానం



అనసూయను సత్కరిస్తున్న వెచ్చా కృష్ణమూర్తి

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 23(ఆంధ్ర జ్యోతి): ప్రముఖ సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌ను ఈవీవీ కళావాహిని అధ్యక్షు డు వెచ్చా కృష్ణమూర్తి ఘనంగా సత్కరించా రు. నగరంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన అనసూయను కళావాహిని వారు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కళావాహిని సభ్యులు పీ కిరణ్, గుప్తా, మిట్టపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులపై పెన్షనర్లకు సత్వరం వైద్యం అందేలా చూడాలి

● ఈదర వీరయ్య

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హెల్త్ కార్డుల సందేహాలకు బాధ్యత వహించే ఉద్యోగశ్రీ ట్రస్ట్ నిర్వహణ లోప రహితంగా ఉండేలా చర్యలు తీసుకొని పెన్షనర్లకు సత్వరం వైద్యం అందించాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి ఒక లేఖ రాసినట్లు తెలిపారు. హెల్త్ కార్డులతో ఆసుపత్రికి వెళ్ళినపుడు తాజా డేటా లేకపోవటంతో ప్రీ అథరైజేషన్ లభించటం లేదని, దీంతో వైద్యం అందించకుండా రోగులను (పెన్షనర్లను) బయటే వేచి ఉండమని ఆసుపత్రి యాజమాన్యాలు చెప్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఆరోగ్య కార్డులను వినియోగదారుల చట్టం పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. డాక్టర్లు నిర్లక్ష్యం వహించినా , రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లినా నష్ట పరిహారం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సర్వర్‌ను పటిష్టం చేసి డేటా అప్‌డేట్ చేయటం ద్వారా ఉద్యోగశ్రీ పథకం లబ్ధిదారులైన పెన్షనర్లకు ఇబ్బందులు తొలగించాలని వీరయ్య కోరారు.

రైల్‌వికాస్ భవన్ రోడ్డు అధ్వానం

● రోడ్డెక్కిన ర్యాంపులు, ఆక్రమణలు ● నడిరోడ్డులోనే డంపర్‌బిన్‌లు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందల సంఖ్యలో రైల్వే ఉద్యోగులు, పింఛన్‌దారులు, సాధారణ ప్రజలు రాకపోకలు సాగించే మార్గం అది. అలాంటి ఆ వీధి ఆక్రమణలతో నిండిపోయింది. నగరపాలకసంస్థ పర్యవేక్షణ కొరవడటంతో ఎవరికి వారు ఇళ్లు, అపార్టుమెంట్ల ముందు రోడ్డును ఆక్రమించేసి ర్యాంపులు నిర్మించేశారు. కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అయితే ఏకంగా డంపర్‌బిన్‌ని నడిరోడ్డులో పెట్టడంతో అక్కడ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చుట్టుపక్కల వీధులను పట్టించుకొంటున్న నగరపాలకసంస్థ అధికారులు, పాలకులు ఎంతో ముఖ్యమైన రైల్‌వికాస్ భవన్‌కు వెళ్లే ప్రధాన మార్గాన్ని అనాధగా వదిలేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి. పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ మార్గంలో దాదాపుగా 80 అడుగుల రోడ్డు వరకు ఉన్నది. దీనిని నగరపాలకసంస్థ అభివృద్ధి చేయడం లేదు. ఎక్కడికక్కడ గుంతలు పడి ఉన్నాయి. ప్రతీ అపార్టుమెంట్, ఇంటి ముందు ర్యాంపు రోడ్డులో ఇరువైపులా డ్రెయిన్‌లు దాటి ముందుకొచ్చేశాయి. అలానే చాలామంది పార్కింగ్ కోసం కూడా ఆక్రమించారు. దీంతో ఈ మార్గంలో వెళ్లాలంటే అటు రైల్వే ఉద్యోగులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి తొలుత ఆక్రమణలు తొలగించి రోడ్డుని అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.





పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ రోడ్డులో ఆక్రమణలు

నైతిక విలువలు, క్షమశిక్షణ అలవరుచుకోవాలి

● ప్రముఖ పారిశ్రామికవేత్త మాదాల రత్నగిరిబాబు ● ఘనంగా కేజేఎస్ఎస్ ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవరుచుకోవాలని జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటడ్ ఛైర్మన్ మాదాల రత్నగిరిబాబు అన్నారు. గుంటూరు, కుందులరోడ్డులోని కమ్మబాలికల వసతి గృహంలో ఆదివారం కుల, మతాలకు అతీతంగా ప్రతిభ కల్గిన విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కమ్మజన సేవాసమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రత్నగిరిబాబు మాట్లాడుతూ సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని, మంచి, చెడును గ్రహించాలన్నారు. మరో అతిథి కాకతీయ కన్వెన్షన్ సెంటర్ అధ్యక్షుడు క్రొత్తపల్లి రమేష్‌చంద్ర మాట్లాడుతూ కుల, మతా లకు అతీతంగా ఉపకార వేతనాలు అందజేస్తున్న కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దండా బ్రహ్మానందం మాట్లాడుతూ ఉపకార వేతనాలను సద్వినియోగించుకుని చదువులో రాణించాలని అన్నారు. యూబీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ సయ్యద్ జవహార్ మాట్లాడుతూ పేదరికానికి కులం, మతం లేదని ఈ ఉపకార వేతనాలు వారి చదువు కొనసాగించడానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ 300 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.7వేలు చొప్పున రూ.21లక్షలను పంపిణీ చేశామని అన్నారు. పదేళ్లగా మహిళా విద్యను ప్రోత్స హించేందుకు గ్రామీణ విద్యార్థినులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. సభ లో ప్రముఖ ఫార్మాసిస్ట్(యూఎస్ఏ) డీ నీరజ, ప్రముఖ ఆడిటర్ సీహెచ్ వీరబాబు మాట్లాడారు. అనంతరం గణపవరం ప్రధానోపాధ్యాయురాలు బీ సుగుణామణీని సత్కరిం చారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, ఘంటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాలు పొందిన విద్యార్థినులతో దాతలు, కేజేఎస్ఎస్ సభ్యులు

శ్రమ దోపిడీపై ఐక్య పోరాటాలు చేద్దాం

● అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి రాంబాబు ● మార్చి 24, 25న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సబార్డినేట్ కేడర్ ఉద్యోగాల్లో అతి తక్కువ వేతనాలతో తాత్కాలిక ఉద్యోగులను నియమించి బ్యాంకులు శ్రమదోపిడీ చేస్తున్నాయని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. గుంటూరులో రెండు



మాట్లాడుతున్న బీఎస్ రాంబాబు, పాల్గొన్న బ్యాంకు యూనియన్ నాయకులు

రోజులుగా జరుగుతున్న ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశాలు ఆదివారంతో ముగిసాయి. యూనియన్ ఛైర్మన్ కే రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఎస్ రాంబాబు మాట్లాడుతూ 2010 సంవత్సరం తరువాత బ్యాంకుల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానంతో పాటు, బ్యాం కుల్లో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఆయా సమస్యల పరి ష్కారానికి యునైటెడ్ ఫోరం బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో మార్చి 24, 25 తేదీల్లో జరిగే సమ్మెను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పీవీ కృష్ణారావు మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగులను బ్యాంకులో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సీనియర్ ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాలు ప్రారంభించటానికి (1991కి) ముందు సామాన్య ప్రజానీకానికి అనుకూలంగా ఉండేవని, ఆ తరువాత యాజమాన్యాలకు అనుకూలంగా మారాయన్నారు. సభలో కేఎల్ యూ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్ రంగయ్య, విజయవాడ సిద్దార్థ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు, యూనియన్ అధ్యక్షుడు ఎంఎస్ కుమార్ ప్రసంగించారు. కార్యక్ర మంలో సంయుక్త ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గేమ్ చేంజర్ సినిమా కోఆర్డినేటర్ స్వర్గం శివ మోసం

● రూ.4 లక్షల బకాయి చెల్లించలేదని ఆర్టిస్టుల ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గేమ్ చేంజర్ సినిమా కోఆర్డినేటర్ స్వర్గం శివ తమను మోసం చేశాడని పలువురు ఆర్టిస్టులు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగరంలోని శివనాగరాజు కాలనీ ఏడోలైన్‌కి చెందిన ఆర్టిస్టులు నంబూరి తరుణ్, మేకల రమాదేవి తదితరులు మీడియాతో



అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న తరుణ్, రమాదేవి తదితరులు

మాట్లాడుతూ తమకు బాపట్ల ఎంపీ సినిమా షూటింగ్ సమయంలో తాడేపల్లికి చెందిన స్వర్గం శివ పరిచయమయ్యాడన్నారు. అప్ప టికే తాము యూట్యూబ్‌తో పాటు పలు సీరియల్స్‌లలో నటించామన్నారు. మంచి అవకా శాలు ఇప్పిస్తామని హైదరాబాద్ తీసుకెళ్లాడన్నారు. ఈ క్రమంలో గేమ్ చేంజర్ సినిమాలో నటించడానికి రోజుకు 1200 నుంచి 1500 వరకు ఇస్తామని చెప్పాడన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి గత ఏడాది మార్చి 23 నుంచి నవంబరు వరకు 335 మంది ఆర్టిస్టులు గేమ్ చేంజర్ సినిమాలో నటించామన్నారు. అయితే ఇందుకుగాను కేవలం లక్షా 25 వేలు మాత్రమే ఇచ్చాడని మిగిలిన డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తూ వచ్చాడని తెలి పారు. తమకు ఇంకా 4 లక్షలకు పైగా ఇవ్వాల్సి ఉందని, ఆ డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నాడని వాపోయారు. దీంతో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామని తరుణ్ తెలిపారు. సినిమా డైరెక్టర్ తమకు న్యాయం చేయాలని కోరారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

● నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో గుంటూరు ఛానెల్ పొడిగింపునకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని జిల్లా నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఆదివారం రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమడ ఆధునికీకరణకు గతంలో టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ మేరకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఏడాది పొగాకు, మిర్చి శెనగ పంటలు దిగుబడులు తగ్గాయని దీనికి తోడు మద్ధతు ధరలు లేవని దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నాని, ప్రభుత్వం మద్ధతు ధర ప్రకటించి ఆదుకోవాలన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుంటే ఉద్యమ బాటపటేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, లావు అంకమ్మ చౌదరి, కొల్లా రామన్, కారుమంచి విజయ్‌బాబు, కొల్లా నిర్మల, ఈదర భ్రమరాంబ, లావు చౌడేశ్వరి, దివ్వి ప్రమీల, గోవాడ సత్యనారాయణ, కొల్లావీరప్రసాద్, నాయుడు సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగ విరమణ చేసి అన్నమయ్య గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న లంకా సూర్యనారాయణకు మార్కెట్లోకి రాని రెండు సినిమా పుస్తకాలను సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల



సూర్యనారాయణకు పుస్తకాలను అందజేస్తున్న సీతారామయ్య చౌదరి తదితరులు

సంఘం బహూకరించింది. బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘ నేత గుమ్మడి సీతారామయ్య చౌదరి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్, ఎల్ విజయలక్ష్మిలపై నూతనంగా ప్రచురించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ నేతలు టీ వివేకానంద, జీ సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ ఎన్‌టీఆర్ అరుదైన ఫొటోలు, నేటి తరానికి తెలియని ఎల్ విజయలక్ష్మి సినీ జీవిత గాథ ఈ పుస్తకాల ప్రత్యేకత అన్నారు. పుస్తక రూపకర్తలు చిన్ని శ్రీను (రాజమండ్రి), కంపల్లె రవిచంద్రన్ (తిరుపతి) కోరిక మేరకు పుస్తక తొలి ప్రతులను గుంటూరులో పేరున్న అన్నమయ్య గ్రంథాలయానికి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పీవీ సత్యనారాయణ, పీ కోటేశ్వరరావు, లైబ్రేరియన్ సుహాసిని తదితరులున్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి ఆప్టా మద్దతు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధక్షుడు ఏజీఎస్ గణపతి రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు లేఖ అందిస్తున్న ఆప్టా నాయకులు

ఈమేరకు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంఘం చేసిన తీర్మాన కాపీ లేఖను అందజేశారు. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ఎంజీ మెహది, ప్రధాన కార్యదర్శి కే ప్రకాశరావు తదితరులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

అలరించిన సినీ సౌరభాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంక టేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహతి స్వర సుధ రజతో త్సవ వేడుకల సందర్భంగా ఆదివారం జరిగిన సినీ సౌరభాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నా యి. తొలుత చార్టెడ్ అకౌంటెంట్ జి.సాయిబాబు,



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయకులు

సాహితీ ప్రియులు పచ్చి పులుసు సూర్యనారాయణ, కే శ్రీధర్‌బాబు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, మన్నవ సుబ్బారావు, ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమా న్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు తమ గాత్రధారణలో అలనాటి మేటి చిత్రాల్లోని పలు మధుర గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమాన్ని కె.మదన్ మోహన్‌రావు పర్యవేక్షించారు.

ఈ శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్మికులు తమ వివరాలను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏటుకూరురోడ్డు రేగుల రామయ్య భవనం లో ఆదివారం ఈశ్రమ్‌లో నమోదు కార్యక్రమాన్ని ఆయన



ఈ శ్రమ్‌లో పేర్లను నమోదు చేసుకుంటున్న కార్మికులు, పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

ప్రారంభించారు. ఈ సందర్భం గా కోటా మాల్యాద్రి మాట్లాడుతూ ఈ శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు రూ.2లక్షల బీమా అందుతుందని అన్నారు. కార్మికుల పిల్లలకు పెళ్ళికానుక, ప్రసూతి సా యం, సహజ మరణానికి ఆర్థిక సాయం వంటి అంశాలను ఈ పథకంలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, టీ శ్రీనివాసరావు, పప్పుల రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ పై కేసు నమోదు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మద్యం షాపులో చోరీ జరిగిన సంఘటనపై ఆదివారం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణ ప్రధాన కేంద్రం ఐలాండ్ సెంటర్‌లో అనుష్క వైన్స్‌లో అర్ధరాత్రి ఒంటి గంట తరువాత గుర్తు తెలియని వ్యక్తులు షాపులోకి చొరబడి రూ.75 వేల నగదు, 5 మద్యం బాటిళ్లు చోరీ చేశారు. ఈ చోరీ సంఘటన మొత్తం సీసీ కెమేరాలో నమోదైనట్లు దుకాణ నిర్వాహకులు తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

పరీక్షల ముందు ఇలా చదవండి



త్వరలో తెలుగు రాష్ట్రాల్లో బోర్డు పరీక్షలు మొదలు కాబోతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి గత సంవత్సరం సుమారు 10 లక్షల మంది పదో తరగతి, 12 లక్షల మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. ఈ సంవత్సరం కూడా దాదాపు అంతే సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. సమగ్రమైన ప్రణాళిక, సమయ నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. బోర్డు పరీక్షల మార్కులు ఉన్నత విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి. ప్రిపరేషన్ బాగుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షా హాల్‌లో సమయం సరిపోతుంది. అలాగే సరైన స్టడీ ప్లాన్, రివిజన్, మాక్ టెస్టులు రాయడం వల్ల బాగా గుర్తుంటాయి. టాపర్ల టిప్స్ అనుసరించడం, తప్పులు తగ్గించడం ఉత్తమ ఫలితాలకు దోహదం చేస్తాయి. పరీక్షలకు ఉన్న ఈ కొద్ది రోజుల్లో స్మార్ట్ వర్క్ ముఖ్యం అంటున్నారు నిపుణులు...

ప్లానింగ్ ముఖ్యం

1. తప్పక చదవాల్సిన చాప్టర్లను గుర్తించండి. బోర్డు పరీక్షలలో ఎక్కువ స్కోరింగ్ టాపిక్స్ తెలుసుకోండి.
2. రోజువారీ టైమ్ టేబుల్ తయారు చేసుకోండి. ప్రతి రోజు చదవడానికి ఖచ్చితమైన సమయాన్ని కేటాయించండి.
3. చిన్న చిన్న లక్ష్యాలను నిర్ధారించుకోండి. కష్టమైన సబ్జెక్టులో ఒక్కో రోజు ఒక హార్డ్ చాప్టర్, ఈజీ చాప్టర్ లేదా ముఖ్యమైన టాపిక్స్ పూర్తిచేయండి.
4. సమయం వృథా చేయొద్దు. మొబైల్, టీవీ వంటి దృష్టి మళ్లించే విషయాలను తగ్గించాలి.
5. కనీసం 6-8 గంటలు నిద్ర ముఖ్యం.

మంచి మార్కుల చిట్కాలు

6. సొంత నోట్స్ ప్రిపేర్ చేసుకోండి. ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలు, డయాగ్రామ్స్ ఒక దగ్గర రాసుకోండి.
7. రివిజన్ చేయండి. ఒకే విషయాన్ని పదే పదే చదివితే మరచిపోయే ప్రసక్త లేదు.
8. పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయండి. గత 5-10 ఏళ్ల ప్రశ్నపత్రాలను రాసి ప్రాక్టీస్ చేయండి. అకడమిక్ పరీక్షల్లో ఇవే దాదాపుగా రిపీట్ అవుతుంటాయి.
9. పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. మాక్ టెస్ట్ రాయడం ద్వారా లోటుపాట్లను అధిగమించవచ్చు.

సబ్జెక్టుకు ఒక వ్యూహం

10. మేథ్స్ రోజూ ప్రాక్టీస్ చేయాలి. రోజుకు కనీసం 10-15 ముఖ్యమైన లెక్కలు సాల్వ్ చేయండి.
11. సైన్స్ విషయంలో ఫార్ములాలు, డయాగ్రామ్స్, ఈక్వేషన్స్, రియాక్షన్స్ ఒక దగ్గర రాసుకుని ప్రాక్టీసు చేయండి.
12. సోషల్ స్టడీస్‌లో డేట్స్, ఈవెంట్స్ ముఖ్యం. కథల మాదిరిగా చదివి అర్థం చేసుకోవడం ఉత్తమం.
13. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో వ్యాకరణం ప్రాక్టీస్ చేయండి. ముఖ్యమైన వ్యాకరణ నియమాలను రాసి చదవండి.
14. స్మార్ట్ స్టడీ మెథడ్స్ ఉపయోగించండి.

పరీక్ష రోజు

15. తక్కువ ఒత్తిడితో చదవండి. కొండను ఎత్తుకుంటున్నట్టుగా కాకుండా ఆసక్తిగా చదవండి.
16. ఒత్తిడిని తగ్గించుకోవడానికి రోజుకు 10 నిమిషాలు ధ్యానం, యోగా వంటివి చేయండి.
17. ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటి పోషకాహారాన్ని పెంచండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా మెదడు చురుకుగా ఉంటుంది.
18. పరీక్ష ముందు రోజు కొత్త విషయాలు చదవొద్దు. రివిజన్ మాత్రమే చేయాలి.
19. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి. సమయం కంటే ముందే హాల్‌కు చేరుకోండి. ఇతరులు ఎలా చదివారు, ఎంత చదివారు అనే విషయాలపై చర్చ వద్దు. ప్రశాంతంగా ప్రశ్నపత్రం చదివి సమాధానాలు రాయండి.

- డాక్టర్ పవన్‌కుమార్ కాసు

సమాధానాలు రాసేప్పుడు



1. ప్రశ్నను పూర్తిగా చదవండి. తొందరలో తప్పుగా అర్థం చేసుకోవద్దు. ముఖ్యంగా 'ఎక్స్‌ప్లెయిన్, కంపేర్, డిస్క్రైబ్' వంటి పదాలు గమనించండి.
2. టైమ్ ప్లానింగ్ ముందే చేసుకోండి. చిన్న ప్రశ్నలకు తక్కువ సమయం, దీర్ఘ సమాధానాలకు ఎక్కువ సమయం పక్కాగా పాటించండి. బాగా వచ్చు కదా అని చిన్న ప్రశ్నకు ఎక్కువ సమయం తీసుకుని చివర్లో ఇబ్బంది పడొద్దు.
3. స్పష్టమైన, క్రమబద్ధమైన రాత ముఖ్యం. సమాధానాన్ని పాయింట్స్‌గా రాయండి. ఎక్కువ పేరాలు అన్నట్లు కాకుండా లాజికల్ ఫ్లోలో ఉండేలా చూసుకోండి.
4. ముఖ్యమైన పాయింట్లకు అండర్‌లైన్ చేయండి. ఆయా పదాలను హైలైట్ చేయడం వల్ల పరిశీలకుడు సమాధానం స్పష్టంగా చూడగలుగుతాడు.
5. తగిన డయాగ్రామ్స్, చార్ట్‌లు వాడండి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జాగ్రఫీ వంటి సబ్జెక్టులకు సరైన పటాలు, డయాగ్రామ్స్ గీయండి.
6. తప్పులు తగ్గించేందుకు స్పష్టమైన భాష వాడండి. అపరిపక్వమైన పదజాలం, క్లిష్టమైన వ్యాకరణాన్ని ఉపయోగించ వద్దు.
7. లెక్కలు, సైన్స్‌ల్లో స్టెప్ బై స్టెప్ ఆన్సర్ రాయండి. నేరుగా సమాధానం రాయకుండా, ప్రతి స్టెప్ చూపించి రాయడం వల్ల పూర్తి మార్కులు వస్తాయి.
8. మినిమమ్, మాగ్జిమమ్ లిమిట్స్‌లో రాయండి. రెండు మార్కుల ప్రశ్నకు 10 లైన్లు రాయడం, 5 మార్కుల ప్రశ్నకు 3 లైన్లు రాయడం తప్పు. సరిపడే సమాచారం అందించండి.
9. చివర్లో సమాధానాలు చెక్ చేసుకోండి. తప్పులు సవరించుకునేందుకు చివరి 5-10 నిమిషాలు కేటాయించండి.
10. పేపర్‌ను క్లీన్‌గా ఉంచండి. అర్థం కాని రాత, ఎక్కువ సార్లు కొట్టివేతలు, స్క్రిబ్లింగ్ ఉండకుండా చూసుకోవాలి.

ఐఐఎమ్‌లు అందించే ఉచిత కోర్సులు ఇవే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు పలు విభాగాలకు సంబంధించిన ఉచిత కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల గురించి కేంద్రప్రభుత్వం నిర్వహించే 'స్వయం పోర్టల్' (https://swayam.gov.in/) ద్వారా తెలుసుకోవచ్చు.

బిజినెస్ కమ్యూనికేషన్ ఎసెన్షియల్స్: ఇది ఐఐఎం బెంగళూరు అందించే 6 వారాల కోర్సు. ఉద్యోగ, వ్యాపారాల్లోని సవాళ్లను ఎదుర్కొనేలా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు. 2025 మే 18 నుంచి క్లాసులు మొదలవుతాయి. 2025 ఫిబ్రవరి 28 వరకు నమోదు కావచ్చు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ మార్కెట్స్: రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఐఐఎం బెంగళూరు అందించే ఈ కోర్సు కాలవ్యవధి ఆరు వారాలు. ఎన్‌రోల్‌మెంట్ 2025 ఫిబ్రవరి 28 వరకు చేసుకోవచ్చు.

ఆర్గనైజేషనల్ బిహేవియర్ అడ్వాన్స్‌డ్ టాపిక్స్: ఐఐఎం షిల్లాంగ్ అందించే ఆరు వారాల కోర్సు ఇది. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగం.

స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్: ఇది 8 వారాల కోర్సు. ఐఐఎం బెంగళూరు అందిస్తోంది.

వాల్యుయేషన్ అండ్ క్రియేటింగ్ సస్టయినబుల్ వాల్యూ: వాల్యుయేషన్ మెథడ్స్, ఎలా వాల్యుయేషన్ చేయాలో ఉదాహరణలతో సహా వివరిస్తారు. ఐఐఎం బెంగళూరు అందించే ఆరు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.

డిజిటల్ మార్కెటింగ్: ఐఐఎం బెంగళూరు నిర్వహించే ఆరు వారాల కోర్సు ఇది. డిజిటల్ ఇన్‌బౌండ్, ఔట్‌బౌండ్ మార్కెటింగ్, లీవరేజింగ్ సోషల్ మీడియా, కస్టమర్ ఇన్‌సైట్స్ తదితరాలు నేర్పిస్తారు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

హెచ్‌ఆర్‌ఎం స్ట్రాటజీ ఎగ్జిక్యూషన్: ఐఐఎం అహ్మదాబాద్ నిర్వహిస్తున్న ఆరు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

డేటా డ్రివెన్ మార్కెటింగ్ డెసిషన్ మేకింగ్: మార్కెటింగ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐఐఎం విశాఖపట్నం డిజైన్ చేసిన 8 వారాల కోర్సు ఇది. కొనుగోళ్లను ప్రభావితం చేసే అంశాలను బోధిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ అనాలిసిస్: ఐఐఎం బెంగళూరు డిజైన్ చేసిన కోర్సు. ఫైనాన్షియల్ కాన్సెప్ట్స్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, అకౌంటింగ్ స్టాండెడ్స్ తదితరాలు ఇందులో ఉంటాయి.

జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్: ఐఐఎం బెంగళూరు అందించే 8 వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

SCHOLARSHIP ALERT

Ramalingaswami Re-entry

Description: Ramalingaswami Re-entry Fellowship 2024-25 is offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to students with relevant PhD/MD degrees or equivalent.
Eligibility: This is open to Indians below 45 years on the application closing date. Applicants must hold a PhD/MD/M.Tech or equivalent degree in specified fields.
Prizes & Rewards: A fellowship of 1,35,000 per month and other benefits. ***Last Date:*** 28-02-2025
Url: www.b4s.in/aj/RFIB2

Quad Fellowship

Description: It is initiated by the governments of Australia, India, Japan, and the US, is administered by the Institute of International Education (IIE).
Eligibility: Open to citizens or legal permanent residents of specific countries including India. Applicants must be at least 18 years of age at the time of application submission and possess a bachelor's degree
Prizes & Rewards: The fellowship offers a one-time stipend of $40,000 and other benefits.
Last Date: 03-03-2025
Url: ww.b4s.in/aj/QUFD1

buddy4study.com

ఆంత్రప్రెన్యూర్ కావడానికీ కోర్సులు ఉన్నాయి

ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి. 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' కరిక్యులమ్‌లో భాగమైతేనే ఇది సాధ్యం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌లో ఆంత్రప్రెన్యూర్ మైండ్‌సెట్ అభివృద్ధి అవుతుందనే ఆలోచనతో హైదరాబాద్ ఐఐటీ 'ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్' స్కూల్‌ను ప్రారంభించింది. అదే బీవీఆర్ సైయెంట్ (బీవీఆర్ స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్). భారతదేశంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేక స్కూల్ ఇది ఒక్కటే. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, అవసరమైన వాతావరణాన్ని ఏర్పడరచడం లక్ష్యాలుగా 2024 జనవరిలో దీనిని ఏర్పాటు చేశారు.

● ఇక్కడ ఫార్మల్ డిగ్రీలు కాకుండా ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై షార్ట్‌టర్మ్ కోర్సులు అందిస్తారు. వీటికి సంబంధించి ఇంజనీరింగ్ వంటి కాలేజీలకు, కార్పొరేట్ సంస్థలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. ఆలోచనలు అవకాశాలుగా, బిజినెస్‌గా ఎలా మలచాలో ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు, ఐఐటీ ఫ్యాకల్టీలు ఇక్కడ శిక్షణ ఇస్తారు. దీనితోపాటు టీహబ్, ఇతర ఇన్నోవేషన్ సెంటర్లతో కలిసి వర్క్ చేస్తున్నారు.

కోర్సులు: ప్రస్తుతం బీవీఆర్ సైయెంట్ కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తోంది. 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ డిజిటల్ ఎరా' కోర్సు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. త్వరలో 'డిజిటల్ అంటర్ ప్రైజెస్', 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ఫర్ ఆంత్రప్రెన్యూర్స్' తదితర కోర్సులు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బీవీఆర్ సైయొంట్ వెబ్‌సైట్ చూడవచ్చు.



Address: BVR SCIENT, IIT- Kandi, Sangareddy, Telangana– 502284 **Mobile:** +91 9160006190, https://bvrscient.iith.ac.in/

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కర్మఫలం నేపథ్యంలో..



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి ప్రధాన పాత్రల్లో ఆండ్రూ బాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బూమరాంగ్'. లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'గ్లింప్స్'ని చిత్ర బృందం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒక డార్క్ సైడ్ ఉంది. కచ్చితంగా ఇది డిఫరెంట్ మూవీ అవుతుంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు ఆండ్రూ బాబు మాట్లాడుతూ 'కరోనా సమయంలో చాలా కథలు రాశాను. అందులోంచి ఎంపిక చేసిన మొదటి కథ 'బూమరాంగ్'. ఇది మెసేజ్ ఓరియెంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం' అని తెలిపారు. నిర్మాత ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 'అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ కావాలి' అని కోరారు. సవాలు విసిరే కథ ఇది. శివ కందుకూరి మంచి నటుడు. భిన్నమైన కథలు చేస్తున్నారు' అని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర ప్రసాద్ అన్నారు.

శబ్దం ఒక అద్భుతం



నాని

"హారర్ సినిమా చూసినా కళ్లు చెమ్మగిల్లుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి కథతో పాటు భావోద్వేగాలు ఉన్న చిత్రం 'శబ్దం'. ఈ సినిమా నేను చూశాను. అద్భుతంగా ఉంది" అని నాని అన్నారు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా, అరివళగన్ దర్శకత్వంలో శివ నిర్మించిన చిత్రమిది. సిమ్రాన్ లైలా, లక్ష్మీ మీనన్ కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ 'ఉపయోగించుకోవాలే కానీ సౌండ్ కూడా ఒక ఆయుధం అవుతుందనే అంశాన్ని 'శబ్దం' చిత్రంలో అద్భుతంగా చూపారు' అని ప్రశంసించారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'వైశాలి నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. ఇప్పుడు శబ్దం కూడా నాకు స్పెషల్ మూవీ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. తమన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడని అరివళగన్ చెప్పారు.

అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది



సందీప్ కిషన్

సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మజాకా'. త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కెఆర్ బన్సల్ నిర్మించారు. ఈనెల 26న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో హయ్యస్ట్ నెంబర్స్‌ని ఈ సినిమా ఇస్తుంది. థియేటర్‌లో కుటుంబసమేతంగా చూసే చిత్రమిది. రావు రమేశ్ అద్భుతంగా నటించారు. ఆయన వల్ల కథ మరింత పండింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ 'నేను ప్రతి సీన్‌లో మ్యాజిక్ ఉండాలని నమ్ముతాను. నా ప్రతి సినిమాలో కూడా మ్యాజిక్ జరుగుతుంది. ఇందులో కూడా ఓ మ్యాజిక్ ఉంది. శివరాత్రి నాడు డబుల్ మ్యాజిక్ జరుగుతుంది. డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుంది' అని తెలిపారు. రావు రమేశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా చేయడం నాకు కొత్తే. ఇందులో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది. ఒక ఎమోషనల్ సీన్ ఉంది. అది ఐకానిక్‌గా నిలిచిపోతుంది' అని అన్నారు. హీరోయిన్ రీతూ వర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ' ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. రీతు వర్మ డ్యాన్స్ అదరగొట్టింది' అని అన్నారు.

మాఫియాతో పోలీస్ పోరాటం



సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించే పోలీసాఫీసర్ కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'విద్రోహి'. రవి ప్రకాశ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీఎస్‌వీ దర్శకత్వంలో వీ వెంకట సుబ్రహ్మణ్యం, వీ కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. రవి ప్రకాశ్ మాట్లాడుతూ 'ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. దర్శకుడిగా వీఎస్‌వీకి పేరు తెస్తుంది' అన్నారు. ఒక తెలివైన పోలీసు మాఫియాను మట్టుబెట్టిన తీరు ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల.

పశ్చిమ డెల్టాకాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 136 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 237, పశ్చిమకాల్వకు 140, నిజాంపట్నంకాల్వకు 90, కొమ్మమూరు కాల్వకు 720 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

నీటి నాణ్యతా పరీక్షలపై శిక్షణ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని తుమ్మలపాలెంలో వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ, నీటి సరఫరా వ్యవస్థపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన 30 మంది మహిళలకు ఈ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ వివిధ రకాల నీటి వనరుల ద్వారా గ్రామాల్లోనికి సరఫరా అయ్యే నీరు కలుషితం అవడం జరుగుతుందన్నారు. దీని వల్ల ప్రజలు రోగాల భారిన పడే అవకాశం ఉందన్నారు. దీని నుంచి గ్రామాలను రక్షించేందుకు మహిళలకు నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించే విధానంతో పాటు నీటి సరఫరా వ్యవస్థను అంచనా వేయడంపై శిక్షణ ఇస్తామన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

తాడేపల్లి (గుండిమెడ), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, ఎన్టీఆర్ వైద్యసేవ, శంకర్ కంటి ఆస్పత్రి సంయుక్త సహకారంతో ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ 100 మంది పరిసర ప్రాంత ప్రజలు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారికి బీపీ, షుగరు, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు విజయవాడ శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, అనుమోలు వీరాంజనేయులు, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, కాసరనేని అంకినీడు, డాక్టర్ రాధాకృష్ణ, మొవ్వ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

● సజీవ దహనమైన గేదెదూడలు



అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన పూరిల్లు

దుగ్గిరాల, ఫిబవరి 23 (ఆంధ్రజ్యో తి): పేరుక లపూడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధం కాగా రెండు గేదె దూడలు సజీవ దహనమయ్యాయి. గ్రామానికి చెందిన గంపల పాములు ఇంటికి నిప్పంటుకుని పూర్తిగా కాలిపోగా, పంచలో కట్టివేసియున్న రెండు గేదెదూడలు మంటల్లో కాలిపోయాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడం, ఇరుగు పొరుగువారు కూడా దగ్గర్లో లేకపోవడంతోనూ, ప్రమాదాన్ని గుర్తించ లేకపోయారు. కాగా సమీపంలో పలుగునకు కట్టివేసియున్న గేదె అరుపులతో అటుగా వెళుతున్న ఓరైతు గమనించి కేకలు వేశాడు. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గేదె కూడా ఒకవైపు పూర్తిగా కాలిపోయి, తీవ్రంగా గాయపడింది. అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. రెండు లక్షల వరకూ నష్టం ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. విలువైన సామగ్రి కూడా బయటకు తీసుకురాలేక పోయామని, తమను ఆదుకోవాలని కుటుంబసభ్యులు పార్వతీ, గోపి, భూలక్ష్మిలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా రోటరీ వ్యవస్థాపక దినోత్సవం

పెదనందిపాడు, ఫిబ్రవరి, 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోకా పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారీస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 120 సంవత్సరాల క్రితం పాల్‌హారీస్ మరో నలుగురితో కలిసి రోటరీ క్లబ్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా పోలియో నిర్మూలనకు విశేష కృషిచేశారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్‌వీఎస్ నాగేశ్వరరావు, కోశాధికారి కోడూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తాడేపల్లి (ఉండవల్లి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో ఈ నెల 26వ తేదీ బుధవారం జరుపుకునే శివరాత్రి పండుగ సందర్భంను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రంథాల ప్రచారం, శివరాత్రి పండుగపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, టీవీ కృష్ణారావు, ఆర్ రామకృష్ణ, బీ శివలింగం నాయక్, టీ బ్రహ్మం, పట్టాభి శ్రీను, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు



మంగళగిరి ఆంజనేయకాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదీన జరుగ నున్న కృష్ణా, గుంటూరు జిల్లల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం పట్టణంలోని ఆంజనేయకాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ధనుంజయరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థి, యువత, నిరుద్యోగులను దారుణంగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అలుగూరి రాజశేఖర్, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, వంగర లక్ష్మయ్య, గోలి మోహనరావు, తిరుమలశెట్టి హనుమంతరావు, గోలి బాబూరావు, గద్దె శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. రత్నాల చెరువు, శ్రామికనగర్, సుందరయ్య నగర్, లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో జరిగిన ప్రచారంలో పడవల మహేష్, గంటా దుర్గాప్రసాద్, వడిశా నరేష్, నాగేంద్రం, బాలాజీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. 12వ వార్డులో జరిగిన ప్రచారంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంకా బాలాజీ గుప్తా, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాజేటి సూర్యవేణుగోపాల కృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ప్రచారం

తాడేపల్లి (కుంచనపల్లి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఆదివారం కుంచనపల్లిలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి అభ్యర్థిని గెలిపించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే కూటమికి మద్దతు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో మన్నే సత్యనారాయణ, అడుసుమల్లి సత్యనారాయణ, శేషుబాబు, సీఎం రావు, బుల్లబ్బాయి, సత్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణంలో..

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆలపాటిని గెలిపించాలని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు కోరారు. ఆదివారం తాడేపల్లి బైపాస్ రోడ్డు, 2, 3 వార్డులలోని శ్రీచక్ర, నేతాజీ, బాలాజీ రెసిడెన్సీ, రైన్‌బో విల్లాస్, పార్క్ విల్లాస్, తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముమ్మడి సత్యనారాయణ, కోగంటి వెంకటేశ్వరరావు, కంతేటి విజయ్ చంద్, వంశీ బలరాం, దేవినేని శివరామకృష్ణ, వెనిగండ్ల వెంకటరావు, నారయ్య, వెంకట్రావు, జగన్, రాఘవులు, హరికృష్ణ, వెంకటరత్నం, కోగంటి ప్రసాద్, హరేరామ్, సుబ్బారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటికి మద్దతుగా గ్రామాల్లో ప్రచారం



చినకొండ్రుపాడులో ఆలపాటికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న గింజుపల్లి శివరామప్రసాద్ తదితర టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి బలపరచిన కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మండలంలో నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటే జరిగే ప్రయోజనాలను పట్టభద్రులకు వివరిస్తూ అన్ని గ్రామాల్లో ప్రచారాన్ని ఉధృతం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ అధ్వర్యంలో మండల పరిధిలోని చినకొండ్రుపాడు, వంగిపురం గ్రామాల్లో ఈ ప్రచారం నిర్వహించారు. అలాగే గొట్టిపాడు డ్వాక్రా మహిళలు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కార్యక్రమాల్లో కుర్రి సుబ్బారెడ్డి, కోటపాటి సదాశివరావు, కాసు పెంటారెడ్డి, పాలేటి సాంబశివరావు, సురేష్, నవీన్, జీవరత్తయ్య, నాదెండ్ల వెంకయ్య, డక్కుమళ్ల భాగ్యారావు, వెలివెల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడు(నాగులపాడు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజాకు మద్దతుగా టీడీపీ నేతలు మండలపరిధిలోని నాగులపాడులో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కలిసి విద్యావంతుడు, ప్రజా సమస్యల పోరాటయోధుడు ఆలపాటికి మద్దతు తెలపాలని, తమ మొదటి ప్రాధాన్య ఓటు ఆలపాటికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీఎస్సీ, నిరుద్యోగభృతి కూడా త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష, నాయకులు పోపూరి లక్ష్మీనారాయణ, నూతి శ్రీనివాసరావు, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పెదనందిపాడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ పెదనందిపాడులో ఆదివారం ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజా, విద్యారంగ సమస్యల పరిష్కారానికి లక్ష్మణరావు ఎనలేని కృషిచేస్తారని అన్నారు. తమ మొదటి ప్రాధాన్య ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్త వెంకటశివరావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, దొప్పలపూడి రమేష్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో విస్తృత ప్రచారం..

తాడేపల్లి (కుంచనపల్లి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం తాడేపల్లి మండలం కుంచనపల్లిలో బహుళ అంతస్తుల భవనాలలో ప్రజాసంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరు గా నిలిచి, ప్రజా సమస్యలపై శాసనమండలిలో పోరాడే కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, డీవైఎఫ్ఐ నాయకుడు పల్లె భార్గవ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు జెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు



తుళ్లూరులో పట్టభద్రుల ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తుళ్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం తుళ్లూరులో ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ టీడీపీ నాయకులు కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు, దుకాణాలకు వద్దకు వెళ్లి ఆలపాటికి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా దామినేని మాట్లాడుతూ బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజాను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొమ్మినేని సాంబశివరావు, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, బండ్ల పట్టాభిరామయ్య, ఇందుర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలి

మేడికొండూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ మండల నాయకులు మేడికొండూరులో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాములపాటి శివ, కుర్రా నరసింహారావు, మసీదు సాజిద్, పఠాలం అబ్దుల్ రహీమ్, గోపిదేశి నాగరాజు, చెరుకూరి కోటి, పంగా జనార్దనరావు, కుంభా సాంబశివరావు తదితరులున్నారు.

రెండు వరుస ప్రమాదాలతో నిలిచిన ట్రాఫిక్



చింతలపూడి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి, నిలిచిన ట్రాఫిక్

దుగ్గిరాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రెండు వరుస రోడ్డు ప్రమాదాలతో తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రెండుకార్లు మధ్యలో ఓటీవీఎస్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా గంట వ్యవధిలో రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు కావడంతో ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ ఎస్ వెంకటరవి ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వాహనాలను రోడ్డుపక్కకు చేర్చి, ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రమాదాల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తడి, పొడిచెత్తలను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలి

దుగ్గిరాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి తడి, పొడిచెత్తలను వేర్వేరుగా ఇవ్వాలంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ డైరెక్టర్ ఆదేశాలతో, మండల గ్రామాల్లో రెండ్రోజులపాటు జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం ఆదివారం కొనసాగించారు. ప్రతిరోజూ చెత్తను సేకరించేందుకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. సేకరించిన చెత్తను సంపద షెడ్లకు తరలించి, ఎరువుగా మార్చి అతితక్కువ ధరకు గ్రామస్థులకే విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

తాడికొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తాడికొండలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. వైద్యశిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన వారిలో 28 మందికి శుక్లాల ఆపరేషన్ చేయాలని వైద్యులు గుర్తించారు. ఇప్పటికే 44 మందికి ఆపరేషన్ చేయగా వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, కందుల రామారావు, ధనేకుల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, డాక్టర్లు వనిత, నర్మద, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి

● ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మదన్‌మోహన్‌రెడ్డి



ఆలపాటిని సన్మానిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి, మోహనరావు తదితరులు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంపై పట్టుదల కలిగిన వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన ప్రైవేటు విద్యా సంస్థల సదస్సులో ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, ఉమ్మడి కృష్ణా గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అనంతరం ఏపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, కో కన్వీనర్ జీ మోహనరావు, అపుస్మా అధ్యక్షుడు తులసీ ప్రసాద్, ప్రైవేటు డిగ్రీ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు గుండారెడ్డి, రాష్ట్ర నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, రాఘవయ్య, జూనియర్ కళాశాల రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, తదితరులు ఆలపాటిని సన్మానించి, గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా తంబిబాబు



తంబిబాబుకు నియామకపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి కే నాగేశ్వరరావు, బీ భాస్కర్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా వడ్డేశ్వరం తంబిబాబును నియమించినట్టు సీనియర్ నాయకుడు అద్దేపల్లి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని కార్యాలయంలో తంబిబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇసుకపల్లి అనిల్, వడ్డేశ్వరం ప్రసాద్, ఇసుకపల్లి జోజిబాబు, పున్నయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మికి ఘన నివాళులు

పెదనందిపాడు, ఫిబ్రవరి, 23 (ఆంధ్రజ్యోతి): కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఆంధ్ర వనిత మండలి కార్యనిర్వాహక కమిటీ, తెలుగు సాహితీ సంస్థ కార్యవర్గ సభ్యురాలు పోపూరి ఝాన్సీలక్ష్మి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు సంఘ నాయకులు కొల్లిపర వెంకటేశ్వరరావు, సింహాద్రి ఝాన్సి, గుర్రం విజయ్‌కుమార్, వీఎస్ కృష్ణ, కేఎల్ రాహుల్, కొల్లా రాజమోహనరావు, మన్నవ హరిప్రసాద్, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, రామన్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

● జిల్లా నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో గుంటూరు ఛానెల్ పొడిగింపునకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని జిల్లా నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఆదివారం రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమడ ఆధునికీకరణకు గతంలో టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ మేరకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఏడాది పొగాకు, మిర్చి శెనగ పంటలు దిగుబడులు తగ్గాయని దీనికి తోడు మద్దతు ధరలు లేవని దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నాని, ప్రభుత్వం మద్ధతు ధర ప్రకటించి ఆదుకోవాలన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుంటే ఉద్యమ బాటపటేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, లావు అంకమ్మచౌదరి, కొల్లా రామన్, కారుమంచి విజయ్‌బాబు, కొల్లా నిర్మల, ఈదర భ్రమరాంబ, లావు చౌడేశ్వరి, దివ్వి ప్రమీల, గోవాడ సత్యనారాయణ, కొల్లావీర ప్రసాద్, నాయుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న తలపాగా గ్రామోత్సవం



మల్లన్న తలపాగాకు పూజలు నిర్వహిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు, భక్తులు

మంగళగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ఆదివారం శ్రీశైల మల్లన్న తలపాగా గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శ్రీకాకుళం జిల్లా లావేరు గ్రామానికి చెందిన దేవాంగులు 365 రోజులపాటు రోజుకు ఒక మూర చొప్పున భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షను ఆచరిస్తూ ఈ తల పాగాను మగ్గంపై నేశారు. ఈ తలపాగాను శ్రీశైలం మల్లికార్జున స్వామికి అలంకరించేందుకు తీసుకువెళుతూ మార్గంమధ్యలో మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తలపాగాను శిరస్సుపై పెట్టుకుని పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, జనసేన నేతలు పర్వతం మధుసూదనరావు, చిట్టెం అవినాష్, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు సంవత్సరాది క్యాలెండర్ ఆవిష్కరణ

మంగళగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మార్చి 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు ముద్రించిన తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను స్థానిక శ్రీప్రపత్తి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఆవిష్కరించారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతల విరాళం



అర్చకుడికి రూ.లక్షా611లను విరాళంగా అందిస్తున్న దాతలు

దుగ్గిరాల, ఫిబ్ర వరి 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన కేఆర్ కొండూరు శ్రీమహంకాళీ అ మ్మవారి దేవస్థానం అభివృద్ధి కోసం దాతలు విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నట్లు ఈవో కోగంటి సునీల్ తెలిపారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు మంగళగిరికి చెందిన చిల్లపల్లి వెంకటేశ్వరరావు, పార్వతి దంపతులు రూ.లక్షా 611లను అందించగా, విజయవాడకు చెందిన వీ అప్పారావు, హేమలత దంపతులు రూ.50,116లను విరాళంగా అందించారు. విరాళాలిచ్చిన దాతలకు ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్, అర్చకుడు పావులూరి తారక్‌నాథ్‌శర్మల చేతులమీదుగా అమ్మ వారి చిత్రపటాన్ని బహూకరించారు.

చికెన్ వాడకంలో భయాందోళన వీడండి

● మాజీ జడ్పీటీసీ శివన్నారాయణ

మేడికొండూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో కొద్ది రోజులుగా చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ప్రజల్లో అపోహలు తొలగించేందుకు ఆదివారం పేరేచర్ల జంక్షన్‌లో చికెన్, కోడిగుడ్డు వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మేడికొండూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, కృష్ణా పౌల్ట్రీస్ యాజమాని సురేష్ తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో అత్యంత చౌకగా లభించే చికెన్, కోడిగుడ్లను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజలకు ఎటువంటి వ్యాధులు రావని, ప్రజలు తమలో ఉన్న భయాందోళనను వీడాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివ పౌల్ట్రీస్ యాజమాని చెరుకూరి సాంబశివరావు, టీడీపీ మండల నాయకులు రజనీ కృష్ణ, షేక్ హసన్ తదితరులతో పాటు స్థానికులు పాల్గొని చికెన్ తిన్నారు.

వంకధార వారి ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయసమ్మేళనంలో ఒకచోటకు చేరిన 50మంది కుటుంబీకులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వంకధార ఇంటిపేరు గల ఒకే కుటుంబసభ్యులు ఆత్మీయ సమ్మేళనం దుగ్గిరాలలో ఆదివారం నిర్వహించారు. దుగ్గిరాలకు చెందిన వంకదార కుటుంబంలో జన్మించిన వారితోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పలువృత్తి వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడిన 50మంది ఒకవేదికపై చేరుకున్నారు. ఎంతో కాలం తర్వాత కలుసుకున్న వారు కష్ట సుఖాల అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. రైలుపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరిగిన సమ్మేళనంలో సహపంక్తి భోజనానంతరం ఇటీవల పీహెచ్‌డీ పొందిన వంకధార వారి వంశవృక్షానికి చెందిన డాక్టర్ వి.సరిత, ప్రొఫెసర్ వీ.వెంకటకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ వీ రాజ్యలక్ష్మిలను ఘనంగా సత్కరించి, ఆత్మీయతను చాటుకున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘంతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ 8 నెలల కూటమి పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలతో పాటు ఉపాధ్యాయులు కూడా తమ సమస్యలు చెప్పడానికే భయ పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులపై వేధింపులే కాకుండా యాప్‌ల భారం మోపి ఇబ్బందులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందన్నారు. రానున్న ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నట్లు చెప్పారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయని ఆరోపించారు. పొన్నూరు నియోజకవర్గంలోని పట్టభద్రులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను మంచి మెజార్టీతో గెలిపించారని అదేవిధంగా కూటమి అభ్యర్థిని కూడా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు మన్నవ సుబ్బారావు, మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, మువ్వా వెంకటకృష్ణ, మువ్వా సుభాషిణి, లక్ష్మీనారాయణ చౌదరి, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదార్లు

● ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం ● పట్టించుకోని అధికారులు, నేతలు



అధ్వానంగా తయారైన దావులూరు-చక్రాయపాలెం రోడ్డు



పూర్తిగా దెబ్బతిన్న సిరిపురం-తెనాలి రోడ్డు

కొల్లిపర, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మండల పరిధిలో దావులూరు - చక్రాయపాలెం, సిరిపురం-తెనాలి, చివలూరు-మున్నంగి వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయా రహదారుల మరమ్మతు విషయాన్ని ఏళ్ల తరబడిగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించు కోకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా మార్గాల్లో గతంలో నిర్మించిన రోడ్ల నాణ్యతాలోపంగా ఉండటంతో అతి తక్కువ కాలంలో అవి దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వల్లభాపురం నుంచి ఈమని మీదుగా తెనాలి వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో ఆ వైపుగా వెళ్లాలంటేనే వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు. దీనికి తోడు రోడ్డు అనేక చోట్ల కోతకు గురైంది. గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. ఈ విషయాలను అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకున్న ఎవరూ పట్టించుకోలదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా మార్గాల్లో నూతనంగా రహదారులను నిర్మించాలని వేయించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సత్యనారాయణను సన్మానిస్తున్న మానవత సభ్యులు

ప్రొఫెసర్ సత్యనారాయణ కృషి స్ఫూర్తిదాయకం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా పనిచేసిన ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ కృషి, పట్టుదల స్ఫూర్తిదాయకమని కుమార్ పంప్స్ ఎండీ, మానవత సంస్థ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవత సేవాసంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ హెచ్‌వోడీ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. పుట్టుకతో అంధత్వం కలిగి, తెలుగులో డాక్టరేట్ చేసి విశ్వవిద్యాలయ స్థాయి ఆచార్యుడిగా ఎదగడం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. సన్మాన గ్రహీత సత్యనారాయణ మాట్లాడుతూ తాను సమాజం నుంచి ప్రేమ, తిరస్కరణ రెండూ పొందానని, పట్టుదలతో పీజీ చేసిన తనకు ఉద్యోగం రావడానికి ఎంతో కష్టపడాల్సివచ్చిందన్నారు. సమాజంలో లోపిస్తున్న మానవత్వాన్ని బతికించేందుకు ప్రయత్నిస్తున్న సంస్థను అభినందించారు. కార్యక్రమంలో ప్రసాద్, కొలసాని రాంచంద్, వెంకట్, వాసు, కళ్యాణి, సత్యనారాయణ, పద్మావతి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు. జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించిన పవన్‌కు వీరబ్రహ్మం దంపతులు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

శతాధిక వృద్ధుడు రాజారావు మృతి



రావులపల్లి రాజారావు (ఫైల్‌ఫొటో)

తెనాలి క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధుడు రావులపల్లి రాజారావు (105) ఆదివారం మృతి చెందారు. రాజారావు స్వగ్రామం తెనాలి సమీపంలో ఉన్న యడ్లపల్లి. ప్రస్తుతం పట్టణంలోని చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లో ఉంటున్న కుమారుడు డాక్టర్ కృష్ణ మోహన్‌రావుతో కలిసి ఉంటున్నారు. 1920 డిసెంబరు 5న యడ్లపల్లిలో జన్మించిన రాజారావు, మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్యతో కలిసి తెనాలి తాలూకా హైస్కూల్‌లో చదువుకున్నారు. 40 సంవత్సరాలు గ్రామంలోని పోస్టుమాస్టర్‌గా పని చేశారు. ఇటీవలే 105వ జన్మదిన వేడుకలు కుటుంబసభ్యులు, సన్నిహితులు మధ్య జరుపుకున్నారు. ఆదివారం హఠాత్తుగా మృతి చెందారు.

ఆలపాటికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేద్దాం..

● బ్రాహ్మణ విద్యావేత్తల సమావేశంలో సంఘ పెద్దలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్య ఓటువేసి గెలిపిద్దామని బ్రాహ్మణ సంఘ పెద్దలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని నాజరుపేటలోని శ్రీ విద్యాశంకర భారతి నృసింహసదనంలో వేదిక్ బ్రాహ్మణసేవా సమాఖ్య అధ్యక్షుడు అమ్మణ్ణి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన బ్రాహ్మణ విద్యావేత్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ళ పాలనలో ఆ పార్టీ నేతలు రాష్ట్రాన్ని ఏ విధంగా దివాళాతీయించారో ప్రతి ఒక్కరికీ తెలిసిందేనన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి సైతం గత వైసీపీ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. కూటమి ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ సహకారంతో గాడి తప్పిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్నారన్నారు. నిరుద్యోగులకు అండగా ఉంటూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు మంచి చేస్తానని, బ్రాహ్మణ విద్యావంతులందరూ తనకు ప్రథమ ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ఆలపాటి కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య, అర్చక సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి టి. అనంతాచార్యులు, భాగవతుల కామేశ్వరరావు, జిల్లా మునిసిపల్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ చైర్మన్ కుందేటి సుబ్రహ్మణం, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జూటూరి సత్యనారాయణ, సీఎంకె తిరుమలరావు, మెళ్ళచెరువు అనిల్‌కుమార్, యోగానందచక్రవర్తి, కూటమి నేతలు, బ్రాహ్మణ పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపును కోరుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కూటమి ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఆలపాటిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎన్నికల్లో ఓటు వేసే విధానాన్ని అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో మొహ్మద్ అరీఫ్, ఖలీం, ఫరీద్, సయ్యద్ గాలీబ్‌షహీద్, అమేన్‌ఖాన్, జిలానీ, అహ్మద్, రియాజ్‌ఖాన్, సుభానీ, రబ్బాని, రఫుల్లా, ఫారుక్, కరిముల్లా పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమతుల ఆహారమే మేలు: డాక్టర్ శారద



రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శారద

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు సమతుల ఆహారం తీసుకుంటూ వ్యాయామం, యోగా వంటివి చేయడం ద్వారా షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శారద తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ ఎస్ బిల్డింగ్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శారద రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్థులు తప్పనిసరిగా ఆహారనియమాలను, వైద్యుల సూచనలను పాటించాలన్నారు. గర్భాశయ క్యాన్సర్ దరిచేరకుండా ఉండేందుకు 9 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలకు, 45 సంవత్సరాల లోపు మహిళలు ప్రభుత్వం అందించే హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

రామస్వామి ట్రస్ట్‌లో నిత్యాన్నదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణం బోసురోడ్డులో ఉన్న కాకుమాను రామస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాకుమాను రామస్వామి శాంతి భవనంలో ప్రతిరోజు 40 మందికి అన్నదానం చేస్తున్నట్లు వంశపారపర్య ధర్మకర్త ఉయ్యూరు వెంకట రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్న 9 దుకాణాలకు ఏటా వచ్చే ఆదాయంతో అన్నదానం చేయడంతో పాటు భవనాన్ని రూ.25 లక్షలతో నిర్మించామన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణరంగ కార్మిక సంఘం నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గుమ్మడి రోశయ్య అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల 46 వేల క్లయిమ్‌లు పరిష్కరించాలన్నారు. కూటమి పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పరిష్కరించడం లేదని ఆరోపించారు. కార్మికులకు గుర్తింపు కార్డుల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై సోమవారం ఛలో గుంటూరు కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ, అనుబంధ సంఘాల నాయకులు గుంటూరు ఏడుకొండలు, కచ్చెర్ల సుధీర్, దావీదు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం



డాక్యుమెంటరీలో నటించిన వారిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. తొలుత పాఠశాల నుంచి గాంధీ చౌక్ వరకు రోటరీ సేవలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన చేశారు. గాంధీచౌక్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు పొందిన తెనాలి కళాకారుల డాక్యుమెంటరీ వీరస్థలిలో నటించిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీకృష్ణ, వెంకటరత్నం, రవీంద్రనాథ్, ఈదర వెంకటపూర్ణచంద్, డాక్టర్ జీవనలత, నల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై చెట్ల తొలగింపు పనులు ప్రారంభం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు బ్రిడ్జిపై ప్రమాదకరంగా మారిన చెట్ల తొలగింపు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గత ఐదేళ్లుగా నిడుబ్రోలు వంతెనపై చెట్లు మొలచి బ్రిడ్జి మనుగడకే ప్రమాదంగా మారింది. వంతెనకు ఇరువైపులా భారీగా చెట్లు పెరగడంతో వంతెన శిథిల స్థితికి చేరుకుంటుంది. అయితే వంతెనపై మొలచిన చెట్ల గురించి వచ్చిన వార్తల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి చెట్ల తొలగింపు పనులను చేపట్టారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో పెరిగిన చెట్ల వలన వంతెన గోడలు నెర్రలిచ్చి భారీ పగుళ్లతో ప్రమాదకరంగా ఉన్నాయి. చెట్ల తొలగింపుతో పాటు పగుళ్లను పూడ్చి వేయాలని పట్టణవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

27న అగస్తేశ్వర స్వామి రథోత్సవం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొలకలూరులో ఈ నెల 27న అగస్తేశ్వరస్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు కాళిశెట్టి ఫణికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఉత్సవమూర్తుల గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

పౌష్టికాహారం అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహర్షి దయానంద సరస్వతి 201వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నందివెలుగు మహర్షిదయానంద స్వామి వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో 50 మంది రోగులకు ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కింద పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహక సంఘ సభ్యులు తుమ్మల కృష్ణకుమారి, గుగ్గిలం రామ్మోహన్‌రావు, కూరపాటి రవీంద్రనాథ్, నాగేశ్వరరావు, ఆంజనేయులు, నరసింహారావు, మానవతా సంస్థ నిర్వాహకులు కొలసాని రామ్‌చంద్, కటకం ప్రసాద్, జిల్లా ప్రభుత్వ వైద్యశాల టీబీ యూనిట్ వైద్యాధికారి రమాదేవి, పల్లెకొండ రవికుమార్, అందె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ పై కేసు నమోదు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మద్యం షాపులో చోరీ జరిగిన సంఘటనపై ఆదివారం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణ ప్రధాన కేంద్రం ఐలాండ్ సెంటర్‌లో అనుష్క వైన్స్‌లో అర్ధరాత్రి ఒంటి గంట తరువాత గుర్తు తెలియని వ్యక్తులు షాపులోకి చొరబడి రూ.75 వేల నగదు, 5 మద్యం బాటిళ్ల చోరీ చేశారు. ఈ చోరీ సంఘటన మొత్తం సీసీ కెమేరాలో నమోదైనట్లు దుకాణ నిర్వాహకులు తెలిపారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా పొన్నూరులో వరుస దొంగతనాలు జరుగుతుండడంపై పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రే కాకుండా పట్ట పగలు కూడా చోరీలు జరగడంపై పట్టణ వాసుల్లో ఆందోళన ఉంది.

ద్విచక్ర వాహనం దహనం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): లాడ్జి కింద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన ఆదివారం తెనాలిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతలూరు మండలం మండూరు గ్రామానికి చెందిన గాజుల వర్తి రాజేష్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ లాడ్జిలో పనిచేస్తుంటాడు. శనివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని లాడ్జి ముందు పార్కింగ్ చేసి విధులకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు దానికి నిప్పుపెట్టడంతో పూర్తిగా దహనమైంది. ఆ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సంగీత విద్వాంసుడు రామస్వామికి సన్మానం



సంగీత విద్వాంసుడు రామస్వామిని సన్మానిస్తున్న శిష్యబృందం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంగీత విద్వాంసుడు అన్నవరపు రామస్వామిని శిష్య బృందం ఘనంగా సన్మానించారు. రామలింగేశ్వరపేటలో ఆదివారం పంచరత్న గాన గోష్ఠి నిర్వహించారు. త్యాగరాజస్వామి రచించిన పంచరత్న కృతులను కీర్తించారు. ఈ సందర్భంగా రామస్వామిని గండపెండేరంతో సత్కరించారు. కర్ణాటక సంగీత వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు ఎంతోమంది కళాకారులకు ఆయన శిక్షణ ఇచ్చారని పలువురు ప్రశంసించారు.

యువతి అదృశ్యంపై కేసు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాలిపేటకు చెందిన షేక్ నగీనా (20) రెండు రోజుల నుంచి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. మరో కేసులో తమ ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపి ఉంచారని వైకుంఠపురం పోతురాజు కాలనీకి చెందిన మహిళ నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె ఇంటి పక్కన నివాసం ఉంటున్న రవి, విక్రమ్, అజయ్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

14 మంది జూదరుల అరెస్టు

పెదకాకాని, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 14మందిని అరెస్ట్ చేసినట్లు పెదకాకాని సీఐ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. నంబూరు శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులో తీసుకొని, వారినుంచి రూ.65వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నారాయణస్వామి తెలిపారు.

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

తెనాలి క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ అవడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన స్థానిక సుల్తానాబాద్‌లోని సాయిబాబా దేవాలయం సమీపంలోని కె.గౌరీశంకర్ ఇంటిలో ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో వంట గదిలోని ఫర్నీచర్ పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఫైర్ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ 1983-84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన గురువులను గుర్తు చేసుకున్నారు. మరణించిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీను, సురేష్, బషీర్, శివ కుమార్, ప్రభు, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్ల తరువాత...

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తరువాత కలుసుకుని ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. 1999-2000 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో స్థిరపడిన విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. విద్యనేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. సిల్వర్ జూబ్లీ మొమెంటోలను అందజేశారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేయాలి

ఈవోపీఆర్డీ కేఎస్ మల్లికార్జునరావు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తలను వేర్వేరుగా గృహాల నుంచి సేకరించనున్నట్లు ఈవోపీఆర్డీ కేఎస్ మల్లికార్జునరావు అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి, ములుకుదురు, మాచవరం గ్రామాలలో ఆదివారం చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను కూడా వేరుగా సేకరించనున్నట్లు చెప్పారు. గృహ యజమానులు చెత్త సేకరణ విషయంలో సిబ్బందికి సహకరించాలన్నారు. గ్రామాలలో చెత్త నుంచి సంపద సృష్టించి గ్రామాల అభివృద్ధికి పాటుపడనున్నట్లు చెప్పారు. చెత్త సేకరణ విషయంపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.